విశాలాంధ్ర
విశాఖపట్నం
మంగళవారం 3, జూన్ 2025

సింహాద్రినాధుని దర్శించుకున్న గుజరాత్, అహమ్మదాబాద్ హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దివం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారిని జస్టిస్ సిహెచ్ . మానవేంద్రనాథ్ రాయ్, గుజరాత్ హైకోర్టు, అహ్మదాబాద్, జడ్జి, అహ్మదాబాద్, వారు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ త్రినాధరావు పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు. తొలుత అయన కప్పస్థంభం ఆలింగనం చేసుకున్నారు. పిదప వేదం, నాదాల నడుమ బేడా ప్రదక్షిణ చేసి స్వామివారికి తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పించారు. దర్శనానంతరం వేదం పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి
- మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఐ ధర్నాలు, డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాలలో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ రూరల్, సీతమ్మధార, మహారాణిపేట, ములగాడ, గాజువాక మండల తహశీల్దార్ కార్యాలయాలు సోమవారం వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు జరిగాయి. విశాఖ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలతో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్‌లు మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కలను నిజం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ, 15 లక్షల ఇళ్ల నిర్మాణం అంటూ భారీ ప్రకటన చేసి అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గ్రామాల్లో ఒకటిన్నర, పట్టణాల్లో సెంటు స్థలాలు కేటాయించి లబ్దిదారులను మోసం చేసిందన్నారు. సెంటు స్థలంలో పక్కా ఇంటి నిర్మాణం సాధ్యం కాదని సీపీఐ చెబుతు అప్పటి నుంచీ పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల భూమిని కేటాయించి, పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని ఉద్యమించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. పేదలకు సొంతంటి కోసం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో లబ్దిదారుల నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ అర్జీలు సేకరించి ఇప్పటికే తహశీల్దార్ ఆఫీసుల్లో ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మూడు నెలల కిందట పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల భూమిని కేటాయించడం కోసం ఒక జీవోను విడుదల చేసిందని తెలిపారు. ఆ జీవో మేరకు అర్హుల జాబితా తయారు చేసి, ఇంటి పట్టాల పంపిణీతో పాటు ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ప్రభుత్వ నిధులను కేటాయించాలి కోరారు. వీలైనంత త్వరగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అరకొర పథకాలే అందుతున్నాయని తెలిపారు. ప్రధానంగా మహిళలు, విద్యార్థులు, రైతాంగానికి సంబంధించి సూపర్ సిక్స్ లో అంతర్భాగమైన పథకాలేవీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి జూన్ 4 వ తేదీకి ఏడాది అవుతోందని, సూపర్ సిక్స్ పథకాల అమలులో జాప్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలలో పార్టీ కార్యవర్గ సభ్యులు ఎం. మన్మధరావు, సి ఎస్ క్షేత్రపాల్, కె సత్యాంజనేయ, కె సత్యనారాయణ, కె వనజాక్షి, ఎం డి బేగం, ఎ దేముడమ్మ, బి పుష్పలత, ఎం సంధ్యాకుమారి, ఎస్ సూర్య కాంతం, పి దివ్య, కె లక్ష్మణరావు, బి కేశవయ్య, సీహెచ్ కాసుబాబు, కె సందీప్, కె జగ్గస్వామి, ఎస్ త్రినాధరావు, పి రమణ, కె రామ్ మహేష్ తదితరులతో పాటు ఇళ్ల కోసం వ్యక్తిగత దరఖాస్తులు చేసుకున్న ఆరిలోవ, మధురవాడ ఏరియాల నుండి పేద ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గాజువాక : అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ పార్టీ ధర్నా నిర్వహించింది. ధర్నా నుద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇస్తానని హామీ ఇచ్చిందని, ఏడాది గడిచినప్పటికి ఇచ్చిన హామీ నీ నిలబెట్టు కోలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కిచ్చిన హామీలన్నింటినీ అమలు పరచాలని డిమాండ్ చేసారు. అనంతరం గాజువాక డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాస రావుకు సిపిఐ ప్రతినిధి వర్గం వినతి పత్రం అందజేసింది. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె.వనజాక్షి, జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, కె. అచ్యుత రావు, పిల్లా పద్మ, పెదపూడి దుర్గారావు, పల్లే టి పోలయ్య, చంద్రశేఖర్, శివ, గణేష్ పాల్గొన్నారు.

మల్కాపురం : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పశ్చిమ నియోజకవర్గం మొలగాడ మండల కార్యాలయం వద్ద ధర్నా చేయడం జరిగింది. సోమవారం 59వ వార్డు ములగాడ ప్రాంతంలో గల తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం సిపిఐ కార్యదర్శి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు పట్టణంలో మరియు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పల్లెల్లో ఇవ్వాలని, కిట్కో ఇల్లులు అర్హులుగా గుర్తించిన వారికి డీడీలు కట్టిన వారికి వెంటనే టిట్కో ఇల్లులు ఇవ్వాలని ఇప్పటికే అద్దెలు కట్టలేక ఎన్నో కుటుంబాలు వీధుల పడుతున్నాయని కూటమి ప్రభుత్వాలను హెచ్చరించారు మరియు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా ఎక్కడ అభివృద్ధి కనపడలేదు అని మరియు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇళ్ల పట్టాలు ఇల్లు నిర్మాణానికి స్కీము 5 లక్షల రూపాయలు ఇవ్వాలని పశ్చిమ నియోజకవర్గం కార్యదర్శి ఆంజనేయ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు మరియు సిపిఐ పార్టీ నాయకులు గండి అప్పారావు మరియు శేఖర్ శ్రీనివాస్ డి గోపి మరియు ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం నాయకురాలు గుడాల జయ మరియు గండి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలకు మోక్షం ఎప్పుడు : సీపీఐ

విశాలాంధ్ర-తగరపువలస : సిపిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపుమేరకు ప్రతి జిల్లాలో సూపర్ సిక్స్ హామీలు అమలుకై సిపిఐ వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. భీమిలి భారత కమ్యూనిస్టు పార్టీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చాలని కోరారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పేదవానికి గ్రామాల్లో మూడు సెంట్లు ఇండ్ల స్థలాలు ఇండ్ల నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయలు కోరుతూ నిరసన తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలోని ఎప్పుడు పెన్షన్లు ఇస్తారని ఇచ్చిన హామీలన్నీ ఇప్పుడు నెరవేరుస్తారని,వాగ్దానాలు చేసి మరి ప్రజల దగ్గర ఓట్లు అడిగి వేయించుకున్న సందర్భంలో ఉన్నాయని మరి ఇప్పుడు కాలాతీతం అయిందని మీరు వచ్చే సంవత్సరం అన్నిరకాల పెన్షన్లు ఇవ్వాలని కోరుతూ ముఖ్యంగా వితంతువు పెన్షన్లు డేట్లు తో సంబంధం లేకుండా ఇవ్వాలని అలాగే అనారోగ్య డయాలసిస్ పెన్షన్లకు వికలాంగులకు వృద్ధులకు అందరికీ త్వరితగతిన ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భీమిలి ఏరియా కోరారు కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి అప్పలరాజు సమితి సభ్యులు ఆదినారాయణ గోవింద రావు పాల్గొన్నారు.

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వార్డు కాకరలోయ భగత్ సింగ్ కోడలి వద్ద సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మరియు రోడ్లు డ్రైనేజీలు శిథిలమైపోయిన కూటమి ప్రభుత్వాలు పట్టించుకోలేదు ముఖ్యంగా ఒంటరి మహిళలకు 30 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని, 55 సంవత్సరాలకి పెన్షన్లు ఇస్తామని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని కల్లబొళ్ళ మాటలు చెప్పి గత ప్రభుత్వం చేయలేనివి మేము చేస్తామని అధికార వచ్చిన తర్వాత హామీలన్నీ పక్కన పెట్టడం కూటమి ప్రభుత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేగుల సత్యాంజనేయ విమర్శించారు వెంటనే అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ విశాఖ జిల్లా సమితి సభ్యుడు గుడాల రాంబాబు మరియు జి అప్పారావు మరియు ఎస్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ పాత నేరస్తులు అరెస్టు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : నగరంలో కొన్నాళ్లుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న చైన్ స్నాచింగ్ కేసుల్లో కీలక పురోగతి సాధించినట్లు విశాఖపట్నం పోలీసులు ప్రకటించారు. పలు చైన్ స్నాచింగ్ ఘటనలకు పాల్పడిన పాత నేరస్తుల ముఠాను అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, గాజువాక ప్రాంతానికి చెందిన ఉరుకుటి నూకాలమ్మ తన చిన్న కుమారుని ఇంట్లో రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులు నిద్రించగా, నూకలమ్మ కిటికీ దగ్గర తలుపు వేసుకుని పడుకున్నారు. తేదీ 27.05.2025 అర్ధరాత్రి 02:00 గంటల ప్రాంతంలో, ఆమె గాఢనిద్రలో ఉండగా, ఒక గుర్తు తెలియని వ్యక్తి కిటికీ దగ్గరికి వచ్చి, ఆమె మెడలో ఉన్న రెండు పేటల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. ఆమె అరుపులు విని, ఆమె కుమారుడు సన్యాసిరావు బయటకు వచ్చి, పల్సర్ బైక్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోతున్న దృశ్యం చూశాడు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినా, బంగారు గొలుసుతో పరారయ్యారు. దీంతో ఆమె పోలీసులను సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచింగ్ కేసు నమోదు చేసి విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. సిసిటివి ఫుటేజీల పరిశీలన, పాత నేరస్తుల డేటాబేస్ విశ్లేషణ, పక్కా సమాచారం ఆధారంగా గాజువాక పెద గంట్యాడ ప్రాంతాలకు చెందిన ఏ1 గా చేపల ఆనంద్,ఏ2: కంబాల శ్రీరాజు లను పోలీసులు నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ. 56,250/- విలువైన రెండు పేటల బంగారు గొలుసు మరియు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుపై పోలీస్ అధికారులు మాట్లాడుతూ, "చైన్ స్నాచింగ్ నేరాలను అరికట్టడానికి మేము కట్టుబడి ఉన్నాము. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టడం, పకడ్బందీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి నేరాలను అరికడతాము. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి" అని కోరారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 253 వినతులు : కలెక్టర్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలను వెంటనే ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తక్షణమే అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు అధికారులు శాఖాపరమైన సమీక్ష నిర్వహించి, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవిఎమ్‌సి అడిషనల్ కమిషనర్ వర్మ,వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రూప్1, గ్రూప్ 2 అధికారులు ఒక పేద కుటుంబంలో వారిని (బంగారు కుటుంబాలు) అడాప్ట్ చేసుకుని చదువుపరంగా కానీ, హెల్త్, స్కిల్ డెవలప్మెంట్, తదితర అవసరమైన సహాయం చేయాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమం జూన్ 21వ తారీఖున నిర్వహిస్తున్నామని దానికి అందరూ అధికారులు నిబద్ధతతో పనిచేసి తమ కార్యాలయంలో పనిచేసే తోటి వారిని, వారు నివసించే పరిసరాలలో ఉన్న వారిని ఈ కార్యక్రమంలో భాగ్యస్తులను చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి టీ షర్టు, యోగ మ్యాట్ ఇవ్వబడుతుందని, ముందుగా వారు వెబ్ సైట్ నమోదు చేసుకోవాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 253 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 93ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి21, జీవీఎంసీ సంబంధించి 77 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 62 వినతులు వచ్చాయి.

విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచాలి

- దేశీయ విత్తనాలను పరిరక్షించండి
- వేసవిలో మనం తినే పండ్ల విత్తనాలతో విత్తన బంతులు చేయండి
- వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

విశాలాంధ్ర-విశాఖ : విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అవసరమని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. వీఎంఆర్డీఏ, సిఫా, గ్రీన్ అంబాసిడర్స్, ఎస్ ఆర్ యు - జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవోల నేతృత్వంలో కైలాసగిరిపై సోమవారం 20 వేల విత్తన బంతులు చల్లిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఔషధ గుణాలు ఉన్న, పక్షులు గూళ్ళు పెట్టుకునే, పక్షులకు ఇతర జీవులకు ఆహారాన్ని ఇచ్చే చెట్ల విత్తనాలతో విత్తన బంతులు తయారు చేయించడం అవసరమని అన్నారు. పది వేల సంవత్సరాల క్రితం వ్యవసాయం చేయడం ప్రారంభించిన కాలంలో విత్తన బంతులు తయారు చేసి అవసరమైన చోట వనాలు పెంచారని, ఆ విధానాన్ని కైలాసగిరి మీద కూడా అనుసరించామన్నారు. దేశీయ విత్తనాలను పరిరక్షించడం ఆనందదాయకం అన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ వేసవిలో మనం తినే పండ్ల విత్తనాలతో విత్తన బంతులు చేయాలన్నారు. అడవులు జీవరాశికి ఊపిరితిత్తుల వలే పని చేస్తాయని, అడవులను కాపాడే బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. దేశీయ ఆవు పేడ, ఒండ్రు మట్టి, బూడిద, దేశీయ అడవి జాతి, ఔషధ గుణాలు కలిగిన, పక్షులు గూళ్ళు పెట్టుకునే, పశుపక్ష్యాదులకు ఆహారాన్ని ఇచ్చే చెట్ల విత్తనాలతో ఈ విత్తన బంతులు తయారుచేయడం జరిగిందిన్నారు. సిఫా ట్రస్ట్ సీఈఓ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ సిరిమాను, అడ్డాకు, బుస, మర్రి, రావి, జువ్వి, నేరేడు, మారేడు, కరక్కాయ, తానికాయ, ఉసిరికాయ, పొగడ, దేవకాంచన, ఇండియన్ చెర్రీ, పొన్న, కుంకుడు, అంకుడు, కొడిస్సి, మామిడి, వేప, గచ్చ, రేగు, సీమ చింత, గుగ్గిలం, కోయిల్, కానుగ, వెదురు, బిల్, చింత, పనస విత్తనాలు వినియోగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ పర్యావరణ ఇంజినీరు పివి ముకుందరావు, పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఆర్ ఎస్ యు-జీవీఎంసీ ప్రాజెక్టు ఇంజనీర్ దాట్ల వివేక్ వర్మ, వీఎంఆర్డీఏ డీఎఫ్ఓ సుజాత శివాని, కైలాసగిరి హార్టీకల్చర్ ఆఫీసర్ రమేష్, ఎస్ ఆర్ యు - జీవీఎంసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ దాట్ల వివేక్ వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, గ్రీన్ వాలంటీర్ ఐ.కృష్ణకుమారి, ఎస్ ఆర్ యు జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు, గ్రీన్ అంబాసిడర్స్ సంస్థ ప్రతినిధులు పుష్ప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై గీతం వర్శిటీలో ఎఫ్.డి.పి.

విశాలాంధ్ర-మధురవాడ : సైబర్ ముప్పులను ఎదుర్కొనే పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరియు హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సి-డాక్) సంస్థ సంయుక్తంగా సోమవారం తేదీ. 02.06.2025న సైబర్ సెక్యూరిటీపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్.డి.పి.) నిర్వహించార్న. సి-డాక్ కేంద్రం అధిపతి డా. సి. హెచ్.ఎ.ఎస్. మూర్తి మరియు ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు డా.శరత్ చంద్రబాబు ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా హాజరయ్యారు. వారు విద్యాసంస్థలు సైబర్ భద్రతా సిద్ధత మరియు మానవ వనరుల అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం ఉన్న భద్రతా లోపాలు, కృత్రిమ మేథ ఆధారిత సైబర్ ముప్పులు, డిజిటల్ మౌలిక సదుపాయాల భద్రత ప్రాముఖ్యత గురించి వివరించారు.జాతీయ ఇ.ఎస్.ఇ.ఎ. (ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవగాహన) ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ కార్యక్రమంలో మారుతున్న సైబర్ ముప్పుల దృష్ట్యా విద్యాసంస్థలలో నైపుణ్యం గల మానవ వనరులను తయారు చేయడం లక్ష్యంగా ఇ.ఎస్.ఇ.ఎ. కృషి చేస్తోందని వారు వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డీన్ డా.ఎస్. అరుణ్ కుమార్ డిజిటల్ భద్రత పెంపుకు మరియు సైబర్ సెక్యూరిటీలో అకడమిక్-ఇండస్ట్రీ సహకారాన్ని బలపర్చడంలో గీతం చేస్తున్న కృషిని వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అధ్యాపకులకు శిక్షణ ద్వారా అకడమిక్ మెరుగుదలతో పాటు రాబోయే సైబర్ సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం గల మానవ వనరులను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆరు రోజులపాటు జరిగే ఈ ఎఫ్.డి.పి.లో నిపుణుల నేతృత్వంలోని సెషన్లు, ప్రాక్టికల్ వర్క్‌షాపులు, సమకాలీన సైబర్ సెక్యూరిటీ ధోరణులపై చర్చలు ఉన్నాయి. ముఖ్యంగా ఐ.ఓ.టి.భద్రత, వల్నరబిలిటీ మరియు ప్రామాణిక రక్షణ వ్యూహాలు వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. జి. లక్ష్మేశ్వరి, సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు డా. కె. నవీన్ కుమార్, డా. విక్రమ్ ధీమాన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవీఎంసీ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 57 వినతులు

నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 57 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమీషనరు డి.వి.రమణ మూర్తితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 57 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 09, 3వ జోన్ కు 06, 4వ జోన్ కు 04, 5వ జోన్ కు 13, 6వ జోనుకు 08, 8వ జోన్ కు 05, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 12 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ %ఆ% అకౌంట్సు విభాగమునకు 05, రెవెన్యూ విభాగమునకు 07, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 26, ఇంజనీరింగు విభాగమునకు 13, మొక్కల విభాగమునకు 01 కలిపి మొత్తంగా 57 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డా.ఇ.ఎన్.వి.నరేష్ కుమార్, చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి,డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్, కృష్ణారావు, శ్రీనివాసరావు, కె.వి.ఎన్.రవి, డిడిహెచ్ ఎమ్.దామోదరరావు, యుసిడి -పి.ఓ డి.లక్ష్మి, డిపిఓలు ఎం.వి.డి ఫణి రామ్, ఎల్.సురేష్, సివిఒ డా.ఎన్.కిషోర్, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, ఏసీపీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవినీకుమారి సేవలు అమోఘం

- అరసం నివాళి

విశాలాంధ్ర-విశాఖ : ప్రముఖ విద్యావేత్త, కాకినాడ ఐడియల్ కళాశాలల అధిపతి, జీవితాంతం వామపక్ష భావజాలంతో ఎన్నో సామాజిక, సహకార, సాంస్కృతిక సమ్మేళనాల నిర్వాహకులకు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలందిస్తూ జీవితాంతం సామాజిక సేవకురాలిగా వెలిగిన డాక్టర్ చిరంజీవినీకుమారి అస్తమయం రచయితలకూ, సామాజిక సేవా సంస్థలకూ తీరని లోటని ఆచార్య చందు సుబ్బారావు అన్నారు. మంచి స్నేహితురాలిని కోల్పోయానని కంట తడిపెట్టారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిశీల రచయితల సంఘం అధ్యక్షురాలిగా ఆమె సేవలు అమోఘమని కొనియాడారు. అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ యూపీఎస్సీ పూర్వ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం కాకినాడలో ఉంటూ అరసం కురువృద్ధుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్‌కి కుడి భుజంగా నిలబడ్డారని, ఆ సమయంలో గోదావరి జిల్లాల అరసం అధ్యక్షురాలిగా, అరసం రాష్ట్ర కార్యదర్శిగా అనేక గొప్ప సాహిత్య, కార్యక్రమాలను నిర్వహించి, ఆమె చేసిన సాహిత్య సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. ఈ అరసం అత్యవసర సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎస్ హనుమంతరావు, బసు పోతన, గరిమ నరసింహం, బొట్ట అప్పారావు, పల్లా జగదీశ్వరరావు, తదితరులు పాల్గొని చిరంజీవినీకుమారికి నివాళులర్పించారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రముఖవిద్యావేత్త, కాకినాడ ఐడియల్ కళాశాలల అధిపతి, జీవితాంతం వామపక్ష భావజాలాన్ని అనుసరిస్తూ ఎన్నోసామాజిక సహకార సాంస్కృతిక సమ్మేళనాల నిర్వాహకులకు ఆర్థిక హార్దిక సహాయసహకారాలందిస్తూ జీవితాంతం సామాజికసేవకురాలిగా వెలిగిన డాక్టర్ చిరంజీవినీకుమారి అస్తమయం రచయితలకూ... సామాజిక సేవా సంస్థలకూ తీరని లోటని ఆచార్య చందు సుబ్బారావు అన్నారు. మంచిస్నేహితురాలిని కోల్పోయానని కంటతడి పెట్టారు.కమ్యునిష్టు భావజాలం గల రాష్ట్ర ప్రగతిశీల రచయితల సంఘం అధ్యక్షురాలిగా ఆమె సేవలు అమోఘమని మాజీ యుపిఎస్సీ సభ్యులు ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. కాకినాడలో వుంటూ అక్కడి అరసంకి అరసం కురువృద్ధుడు డాక్టర్ ఆవంత్ససోమసుందర్ గారికుడిభుజంగానిలబడి అనేక గొప్ప గొప్ప సాహిత్య కార్యక్రమాలను జరిపించిన అరసం యోధురాలు గోదావరి జిల్లాల అరసం అధ్యక్షురాలిగా అరసం రాష్ట్ర కార్యదర్శిగా ఆమెచేసిన సాహిత్యసేవలను అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు కొనియాడారు. అరసం అత్యవసర సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎస్ హనుమంతరావు, బసుపోతన గరిమ నరసింహం, బొట్ట అప్పారావు, పల్లా జగదీశ్వరరావు తదితరులు పాల్గొని చిరంజీవినీ కుమారికి నివాళులర్పించారు.

జేఈఈలో మెరిసిన ఆణిముత్యం

విశాలాంధ్ర-పద్మనాభం : పద్నావ మండలం పాండ్రంగి పంచాయితీ కీ చెందిన ఓ సాధారణ మత్స్యకారి కుటుంబానికి చెందిన అముజురి శ్రీను కుమారుడు అముజురి తారక రామ్ జాతీయస్థాయి జేఈఈ అడ్వాన్స్ లో ఓబీసీలో 151 వ ర్యాంకును సాధించారు. ఓపెన్ క్యాటగిరిలో 936 ర్యాంకును సాధించారు. స్థానిక మాజీ పిఎసిఎస్ చైర్మన్ అమూరి అప్పారావు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించినందుకు గాను అమజూరి తారకరామును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఎంతటి విజయనైనా సాధించవచ్చు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తారక రామ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా అబ్బాయి ఈ స్థాయిలో ర్యాంకు సాధించినందుకు మాకు ఎంతో ఆనందంగా ఉందని ఓ సాధారణ మత్స్యకార కుటుంబంలో పుట్టి ఈ స్థాయిలో ర్యాంకు సాధించడం మేము ఎంతో ఆనంద పడుతున్నామని వారు తెలియజేశారు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో బెహరా విజయకేతనం

విశాలాంధ్ర-సింహాచలం : గ్రేటర్ విశాఖ పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం ఫలితాల్లో బెహర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యధికంగా 96 శాతం మార్కులతో విజయకేతనాన్ని ఎగురవేసింది. ఈ సందర్భంగా బెహర విద్యాసంస్థల సెక్రటరి డా. బెహర చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు అత్యధిక శాతం మార్కులు సాధించడం సంతోషంగా ఉందని భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గురువులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాలల అసిస్టెంట్ డైరెక్టర్ బాణాల తరుణ్, ప్రిన్సిపల్ సుకన్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం టీడీపీ కార్యకర్తల ప్రమాద భీమా పథకం

- పెందుర్తి టీడీపీ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జి



విశాలాంధ్ర-పెందుర్తి : నిరుపేదలకు వరం టీడీపీ కార్యకర్తల ప్రమాద భీమా పథకం అని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గండి బాబ్జి అన్నారు. పెందుర్తి మండలం రాంపురం గ్రామ నివాసి ఇండుగుబిల్లి రాజుబాబు ఈ ఏడాది ఫిబ్రవరి 4న ద్విచక్ర వాహనం ప్రమాదంలో మృతి చెందారు. అతను టీడీపీ సభ్యత్వం కలిగి ఉండడంతో కుటుంబసభ్యులకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం 5 లక్షల ప్రమాద భీమాను మంజూరు చేసింది. దీంతో రాజబాబు భార్య ఆశాజ్యోతి, కుటుంబ సభ్యులను పరామర్శించిన గండి బాబ్జి మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావులు ప్రమాద భీమా చెక్కును సోమవారం ఉదయం అందజేశారు. ముందుగా వారిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని టిడిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నల సన్యాసినాయుడు, అన్నంరెడ్డి బంగారునాయుడు, దొడ్డి శ్రీధర్, బంగారయ్య పాల్గొన్నారు.

ఘనంగా వైశ్యరాజు జ్యూయిలర్స్ ప్రారంభం

విశాలాంధ్ర-మధురవాడ : అద్భుత డిజైన్లు, రాజీలేని నాణ్యత, సరసమైన ధరలు అనే ముఖ్యమైన మూడు సేవలను వినయోగదారులకు అందించటం ద్వారా వారివిస్వాశాన్ని పొంది తమ శాఖలను విస్తరిస్తున్నామని వైశ్యరాజు జుయలర్స్ యండి. వైశ్యరాజు రుద్రగిరి రాజు పేర్కొన్నారు. మధురవాడ కారుషెడ్ కూడలివద్ద జీవీయంసీ 7వ వార్డు పరిధిలో సోమవారం వైశ్యరాజు జుయలరీ మధురవాడ శాఖను భూస్వామి పుండరీకాక్ష రెడ్డి చేతులమీదగా ఘనంగా ప్రారంభించారు. మొదటి కొనుగోలు ను జామి భోజరాజు చేయగా, సంస్థ చైర్మన్ ఫాల్గుణరాజు, డైరెక్టర్లు సురేష్, కిరణ్ కుమార్ రాజు తదితరులతో పాటు పలువురు హాజరైయ్యారు.

వర్షాలు పొంచి ఉన్నాయి. గెడ్డలలో పూడికలు తొలగించండి : నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : వర్షాలు పొంచి ఉన్నందున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల ప్రధాన గెడ్డలు, కాలువలు పొంగిపొర్లకుండా వెంటనే పూడికలను తొలగించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను మేయర్ ఆదేశించారు. సోమవారం ఆయన జోన్-6లో 87,88, జోన్-3లో 18,19 వార్డులలో వార్డు కార్పొరేటర్లు బొండా జగన్నాథం,మొల్లి ముత్యాలు, గొలగాని మంగవేణి, నొల్లి నూక రత్న, జోనల్ కమిషనర్లు, బి ఆర్ ఎస్ శేషాద్రి, కె.శివ ప్రసాద్ లతో కలిసి ఆ యా వార్డులలో విస్తృత పర్యటన చేశారు. ముందుగా జోన్-6లో 87వ వార్డు లో కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి ఎన్టీఆర్ కాలనీ వద్ద ప్రధాన గెడ్డ లో పూడికతీత పనులను గమనించి పారిశుద్ధ్య కార్మికుల తో పూడికతీత పనులు ఎందుకు చేయిస్తున్నారని ఆరా తీస్తూ... కాంట్రాక్టర్ వర్కర్లతో పని చేయించకపోవడంపై కాంట్రాక్టర్ పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు గుడులు వద్ద వాసవి హాస్పిటల్ ప్రాంతంలో ప్రధాన గెడ్డ పూడిక తీత పనులను పరిశీలించి ఇరువైపులా కుప్పలుగా ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని, అనంతరం ఎం వి వి-ఎం కె పార్క్ అపార్ట్మెంట్ నుండి వస్తున్న మురుగునీరు కాలువలోనికి నేరుగా వస్తున్నందున వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాటును వారు చేసుకోవాలని, మురుగు నీటిని కాలువలోనికి విడుదల చేయవద్దని నోటీసులు జారీచేయాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్ కు మేయర్ ఆదేశించారు. అదే కాలువపై అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని ఏసీపీ వెంకట్రావుకు ఆదేశించారు. అనంతరం 88 వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు తో కలిసి దువ్వాడ సెక్టర్ 1 సంధ్యా నగర్ ప్రవేశ ద్వారం వద్ద, సంపత్ వినాయక నగర్ వద్ద ప్రధాన గెడ్డలలో పూడిక తీతలను పరిశీలించారు. సంధ్యా నగర్ రోడ్డుపై కల్వర్టు చిన్నదిగా ఉన్నందున వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నందున బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావుకు ఆదేశించారు. ప్రధాన కాలువలలో, గెడ్డలలో పూడికతీత పనులను నిత్యం పర్యవేక్షిస్తూ మూడు రోజుల్లో పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ బి ఆర్ఎస్ శేషాద్రి కు మేయర్ ఆదేశించారు.

జోన్ 3లో మేయర్ పర్యటన : జోన్ 3లో 18వ వార్డులో కార్పొరేటర్ గొలగాని మంగవేణి తో కలిసి అప్పుఘర్ ఎదురుగా ఉన్న నివాసిత కాలనీలో కాలువలు, రోడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. కైలాసగిరి రోప్ వే ఎదురుగా బీచ్‌లో నిర్మాణ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు అధికంగా ఎందుకున్నాయని ప్రశ్నిస్తూ వాటిని వెంటనే తొలగించాలని, ఇతర వాహనాలు రాకుండా, నిర్మాణ వ్యర్థాలు పడవేయకుండా బీచ్ ప్రవేశ ద్వారానికి ఒక పటిష్టమైన గేట్ ను ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజుకు మేయర్ ఆదేశించారు. అనంతరం 19 వార్డులో నొల్లి నూకరత్నతో కలిసి లాసెన్స్ బే కాలనీ రోడ్ నందు ప్రధాన గెడ్డ లో పూడికతీత పనులను పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్ ల కింద,

స్లాబ్‌ల కింద ఉన్న కాలువలలో వ్యర్థాలను, పూడికలను వెంటనే తొలగించాలని వర్షాలు పడినప్పుడు రోడ్లు జలమయం కాకుండా పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్‌కు, ప్రధాన వైద్యాధికారికు, అలాగే మూడు రోజుల్లో కాలువలలో ,ప్రధాన గెడ్డలలో పుడికతీత పనులు పూర్తి అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ కు మేయర్ ఆదేశించారు. ఈ పర్యటనలో మేయర్ మాట్లాడుతూ తన పదవీకాలంలో నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ విశాఖ నగర అభివృద్ధి ధ్యేయంగా నిత్యం కృషి చేస్తానని అందుకు అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ సహకరించాలని మేయర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాస్ ప్రసాద్, అప్పారావు, గంగాధర్, ఎసిపి వెంకట్రావు, హార్టికల్చర్ ఆఫీసర్ అర్చన, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆడిసా రిసార్ట్ యాజమాన్యం తక్షణమే కార్మికులకు బకాయిలు చెల్లించాలి : సిఐటియు

విశాలాంధ్ర-తగరపువలస : భీమిలి జమ్ము చెరువు పక్కనే ఉన్న ఆడిషా రిసార్ట్ యాజమాన్యం దిగివచ్చి కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు మధురవాడ భీమిలి జోన్ కమిటీల ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు, భీమిలి మధురవాడ జోన్ కమిటీ నాయకులు రాజ్ కుమార్ మాట్లాడుతూ ఈ విషయమే యాజమాన్యాన్ని సంప్రదించగా సరైన విధంగా స్పందించలేదని అందుకే ధర్నా చేపట్టవలసి వచ్చిందని అన్నారు. భీమిలి సిఐటియు జోన్ కార్యదర్శి రవ్వా నర్సింగరావు ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు మాట్లాడుతూ భీమిలి ప్రాంతంలో ఇటువంటి కాంట్రాక్టర్లు బిల్డర్లు కార్మికులకు వేతనాలు కూలీలు ఇలా పెండింగ్ ఎప్పుడూ పెట్టలేదని ఫస్ట్ టైం అడిషా రిసార్ట్ యాజమాన్యం ఇలా చేస్తుందని తక్షణం కార్మికులకి ఇతర సిబ్బందికి పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలని మరల ఎప్పుడు ఇటువంటి పరిస్థితి తీసుకురావద్దని యాజమాన్యాల సంబంధించిన స్టాఫ్ కి తెలియజేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బాధిత కార్మికులు పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తి సహజసిద్ధంగా పెరుగుదలకు బాదం తోడ్పాటు

విశాలాంధ్ర-విశాఖపట్నం : దేశవ్యాప్తంగా కోవిడ్ మరియు ఫ్లూ కేసులు పెరుగుతున్న వేళ, రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవటం చాలా ముఖ్యం అని, రోగ నిరోధక శక్తి పెరగడానికి బాదం తరహా పోషకాలు కలిగిన ఆహారాన్ని రోజువారి తీసుకోవాలని పోషకాహార నిపుణురాలు డాక్టర్ రోహిణి పాటిల్ సూచించారు. కాలానుగుణంగా వచ్చే ఇన్ఫెక్షన్లు కారణంగా తరచుగా దగ్గు, జలుబు, జీర్ణ సమస్యలు మరియు మొత్తం మీద బలహీనమైన రోగనిరోధక శక్తి వంటి అనేక ఆరోగ్య సవాళ్లు ఎదురవుతాయి. బాదం, పసుపు , అల్లం వంటి పోషకాలు అధికంగా ఉండే సూపర్‌ఫుడ్‌లను మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవటం తో పాటుగా ఈ విపత్కర సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో గణనీయంగా సహాయపడుతుందన్నారు. ఈ ఇన్ఫెక్షన్ల సమయంలో శరీరంను ఈ ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుకోవటానికి సాధారణ ఆహారంలో రోగనిరోధక శక్తిని పెంచే సూపర్‌ఫుడ్‌లను డాక్టర్ రోహిణి సిఫార్సు చేశారు. కాలిఫోర్నియా బాదం ముఖ్యమని, కాలిఫోర్నియా బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, జింక్, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు మరియు విటమిన్ ఇ వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి మరియు శక్తిని పెంచడంలో సహాయపడతాయన్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఫార్సు చేసిన ప్రకారం, రోజువారీ ఆహారంలో బాదం పప్పును చేర్చుకోవడంవల్ల రోగనిరోధకశక్తి మెరుగు పడుతుంది. తద్వారా మొత్తం శ్రేయస్సు మెరుగుపడుతుందన్నారు. అదనంగా, కాలిఫోర్నియా బాదం పప్పును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన చర్మానికి మద్దతు లభిస్తుంది, వాటి సహజమైన సంతృప్తికరమైన లక్షణాల కారణంగా సమర్థవంతమైన రీతిలో బరువు నిర్వహణకు సైతం సహాయపడుతుందన్నారు. వీటితోపాటు పసుపు: యాంటీ ఇన్ఫ మేటరీ యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందిన పసుపు, జీర్ణక్రియకు తోడ్పడి అయ్యే అల్లం, వెల్లుల్లి, నారింజ, నిమ్మకాయలు మరియు ద్రాక్షపండ్లు వంటి సిట్రస్ పండ్లు, బొప్పాయి తదితర పోషకాహారాన్ని తీసుకోవాలని చెప్పారు.

వెన్నుపోటు దినమా? ప్రాయశ్చిత దినమా...?

జగన్‌కు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సూటి ప్రశ్న

విశాలాంధ్ర-భీమిలి : జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో సామాన్యుల దగ్గర నుండి అన్ని వర్గాల ప్రజలను ఎంత నయవంచనకు గురిచేసారో ఆ ఫలితమే సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. వైసిపీ జూన్ 4న వెన్నుపోటు దినంగా పిలుపునిచ్చిన నేపథ్యంలో గంటా నూకరాజు స్పందించారు. జగన్ రెడ్డి చేయవలసింది వెన్నుపోటు దినం కాదని. ప్రాయశ్చిత దినంగా మార్చుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించి సిగ్గులేకుండా ఆ దినం, ఈ దినం అని కాకమ్మ కబుర్లు చెబుతున్నారని అన్నారు. కూటమి సర్కార్ రాష్ట్రంలో ఏర్పాటు అయిన తర్వాత ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో మీకు అర్థం కాకపోతే, రాష్ట్రంలో ఉండే విద్యావంతులు అయిన మేధావులు ఉన్నారని వారిని అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమంను రెండుకళ్లుగా చేసుకొని పాలన చేస్తున్న కూటమి సర్కార్ ను అభినందించాల్సింది పోయి లేనిపోని ఆరోపణలు చేసి ప్రజలను ఇంకెన్నాళ్ళు మోసం చేస్తారని అన్నారు. ఎన్టీఆర్ భరోసా ఫించన్ తక్షణమే 1,000 రూపాయలు పెంచి 4,000 రూపాయలు

అందిస్తుందని అన్నారు. మత్స్యకారులకు వేట నిషేధం సమయంలో పరిహారం 10,000 నుండి 20,000 రూపాయలకు పెంచారని అన్నారు. ఉచిత గ్యాస్, ఇసుక పథకాలు రన్నింగ్ లో ఉందని, ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అని ముఖ్యమంత్రి చెప్పారని, జూన్ 12వ తేదీన తల్లికి వందనం ద్వారా ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి అమలు చేస్తామని విద్యాశాఖమంత్రివర్యులు చెప్పారని, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం, భోగాపురం విమానశ్రయం సరవేగంగా నిర్మాణం జరుగుతుందని అన్నారు. కూటమి సర్కార్ పాలన రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని సాగిస్తుంటే వైసిపీ ఎందుకు జూన్ 4వ తేదీన నిరసనకు పిలుపునిచ్చిందో చెప్పాలని డిమాండ్ చేసారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి ఆర్థికంగా కుదేలు చేసింది చాలదు అన్నట్లు ఎందుకు ఈ పిచ్చి శ్రేష్టలు అని నిలదీశారు. వైసిపీ ఐదేళ్ల పాలనలో నాయకులు చేసిన నిర్వాకానికి రాష్ట్రంలో ఉండే జైల్లకు క్యూ కదుతున్నా బుద్ధి రావడం లేదని గంటా నూకరాజు అన్నారు.

విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

విశాలాంధ్ర-గాజువాక : విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని రాష్ట్ర ఐ.ఎన్ టి.యూ.సి నాయకులు, డా. గొందేశి మహేశ్వర రెడ్డి అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం లో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల అభినందన సభ సోమ వారం జరిగింది. అభినందన సభకు మహేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి, సంస్థ ప్రగతికి కృషి చేసిన ఉద్యోగులను అభినందించారు. ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. ఉక్కు ప్రగతిలో కీలకంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేయడం హర్షణీయం అని అన్నారు. ఐఎన్‌టియూసి నాయకులు వై.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు సీరపు ఈశ్వరరావు, ఏల బిల్లి నూకరాజు, గోపాల్‌రాజు, నమ్మి అప్పల నాయుడు, గ్రామ పెద్దలు, నాయకులు గంట్యాడ పైడిరాజు, వై.వి.రమణ, పెద్దాడ నాగేశ్వర్‌రావు, కిలానీ రమణ, ముసలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు ముఖ్య అతిథి శాలువా, దండలతో ఘనంగా సత్కరించారు.

నీతి... మనిషిని నిర్భయుడిగా చేస్తుంది

విశాలాంధ్ర-మల్కాపురం : నీతి, నిజాయితీలతో జీవించడం వల్ల మనిషి నిర్భయంగా, స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో జీవించగలడని ప్రముఖ యువజన నాయకులు చింతకాయల వెంకటరమణ అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో బతికితే, చనిపోయాక కూడా ప్రజల మనసులో ఉంటారని ఆయన అన్నారు. నీతి వల్ల అధికారం, శక్తి, విశ్వసనీయత వస్తాయని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న సామాజిక కార్యకర్త ఎమ్. నాగబాబు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి, ప్రముఖ నాయకుల జీవిత చరిత్రలను చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, జాతీయ సేవా పథకం కార్యకర్త సునీత, పెద్ద సంఖ్యలో బాలలు పాల్గొన్నారు.

జిల్లా కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన బాలు

విశాలాంధ్ర-అనందపురం : జనసేన పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టులు భర్తీలో భాగంగా విశాఖ జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా తాతారావును నియమించారు. ఈ సందర్భంగా సోమవారం చైర్మన్గా ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆనందపురం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గొలగాని గోవింద్ (బాలు) చైర్మన్ ను కలిసి శు భాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా రైతుల సమస్యలు పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని చైర్మన్ తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీ విశ్వ విద్యార్థుల ఘన విజయాలు



విశాలాంధ్ర-ఆనందపురం : జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో విశాఖపట్నానికి చెందిన శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తరాంధ్రలోనే అత్యధిక ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటారని కళాశాల చైర్మన్ కే ధర్మరాజు తెలిపారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులు భవిష్యత్తులో ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలైన ఐఐటీ-ఎన్ఐటీ, ట్రిబుల్ ఐటిలలో చేరేందుకు అర్హత పొందారన్నారు.

ప్రధాన ర్యాంకులు సాధించిన విద్యార్థులు : జాతీయ ర్యాంక్ బి. నవదీప్ రాజు 31, ఏ. తారక్ రామ్ 151, ఎల్.హరికేశ్ 519, హెచ్.వెంకట హేమవర్ధన్ 592, కె.బాలరాం 706, బి.శణ్ముఖ నాయుడు 765, యు. జయంత్ కుమార్ 953, వై.రాజశేఖర్ 1522, డి.రవిరాజు 1917, పీ.నితీష్‌కుమార్ 2396, జాతీయ ర్యాంకులు సాధించారన్నారు. 1000 ర్యాంకులోపు-7 మంది 5000 ర్యాంకులోపు-30 మంది 10000 ర్యాంకు లోపు-52 మంది మొత్తం 297 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె. ధర్మరాజు మాట్లాడుతూ "ఈ ఫలితాలు మా విద్యాసంస్థ విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయి. ఇది మా అధ్యాపక బృందం కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల అంకిత భావానికి ఫలితం," అని పేర్కొన్నారు. డైరెక్టర్ పీ. సూర్యనారాయణ విజేతలకు శు భాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థుల విజయాలతో సంస్థకు గర్వకారణంగా ఉందని తెలిపారు.

యారాని వాటర్ పార్క్ నుండి సరిపల్లెను కాపాడండి

హైకోర్టు అడ్వకేట్ కమిషన్‌కు గ్రామస్తులు ఫిర్యాదు

విశాలాంధ్ర-పెందుర్తి : యారాని వాటర్ పార్క్ నుండి తమ గ్రామాన్ని రక్షించాలంటూ పెందుర్తి మండలం సరిపల్లి గ్రామస్తులు హైకోర్టు అడ్వకేట్ కమిషన్ కు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు పొందకుండా ప్రజలు ఆందోళన చెందుతున్నా పట్టించుకోకుండా గత వైసిపి ప్రభుత్వం హయాంలో అక్రమంగా సరిపల్లి గ్రామం నడిబొడ్డున భారీ వాటర్ పార్కును నియమించారని దీనిపై హైకోర్టును ఆశ్రయించగా కోర్టు అడ్వకేట్ కమిషన్ ను ఏర్పాటు చేసి స్టే ఇచ్చారని ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, సర్పంచ్ గొర్లె.రామకృష్ణ గ్రామ పెద్ద ఎన్ ప్రసాద్ (జెసిబి) ఏం .రవి సుందర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో ఏరాని వాటర్ పార్క్ నిర్మాణానికి ప్రయత్నించగా గ్రామస్తులందరం పంచాయతీ తరపున అడ్డుకునేందుకు ప్రయత్నించామని, అయితే ఆ సంస్థ యజమాని తప్పుడు పత్రాలతో హైకోర్టును తప్పుదారి పట్టించి జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతులకు ప్రయత్నించారని వెల్లడించారు. ఈ విషయం తెలిసి తాము రెవెన్యూ జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశామని వాటర్ పార్క్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు తమను అరెస్టు చేసి స్టేషన్ కు తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఇదిలా ఉండగానే పార్కుకోసం సాగునీటి గడ్డను కబ్జా చేసి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని అక్కడ రోడ్డు ఏర్పాటు చేస్తే వర్షపు నీటికి గ్రామమంతా మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. రెండేళ్ల క్రితం వాటర్ పార్కు నిర్మాణ సమయంలోనే తితిలి తుఫాను వర్షాలకు సరిపల్లి గ్రామం అంతా నీట మునిగిందని తెలిపారు. ఇప్పుడు గడ్డను కూడా మూసేస్తే పెద్ద వర్షాలు కురిస్తే సరిపెల్లి గ్రామానికి ముంపు ముప్పు తప్పదని వాపోయారు. అలాగే వాటర్ పార్కు వృధా నీరు కారణంగా భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ఇంకా వాటర్ పార్క్ సందర్శనకు వచ్చే యువకుల కారణంగా ఈ ప్రాంతంలో శాంతిభద్రతల ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. సరిపల్లి గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న మరో వాటర్ పార్కు సందర్శనకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే యువకులు రౌడీలు కారణంగా ఇప్పటికే ఆడపిల్లలు భయ్యా కంపితలే ఉన్నారని చెప్పారు. ఇప్పుడు మరో భారీ వాటర్ పార్క్ ప్రారంభమైతే సరిపల్లె గ్రామంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని హైకోర్టు కమిషన్కు వివరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా నిర్మాణం చేపట్టిన యారాని వాటర్ పార్కును అలాగే సాగునీటి గడ్డపై నిర్మించిన రోడ్డును తొలగించి సరిపల్లి గ్రామాన్ని రక్షించాలని సర్పంచ్, ఎంపిటిసి, జెసిబి ప్రసాద్ సహా పెద్ద సంఖ్యలో రైతులు పెద్దలు అడ్వకేట్ కమిషనర్ ఉదయ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రెవెన్యూ అధికారులు కూడా న్యాయవాదికి వాటర్ పార్క్ నిర్మాణం కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అలాగే వాటర్ పార్క్ యజమాని నుండి హైకోర్టు న్యాయవాది వాటర్ పార్క్ నిర్మాణం సంబంధించిన అనుమతి పత్రాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో విజయవంతంగా 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ఆర్థోపెడిక్ వైద్య సేవల్లో విశాఖలో కేర్ హాస్పిటల్స్ ముందుందని, తమ ఆధునిక వైద్య సదుపాయాలతో 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈ మైలురాయి, రోగి సంరక్షణ, మరియు అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికతకు ఒక నూతన దశను సూచిస్తోందని కేర్ వైద్యులు తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో, మంచి అనుభవం కలిగిన డాక్టర్లతో ఈ శస్త్రచికిత్సలు అత్యంత ఖచ్చితత్వంతో జరిపామన్నారు. ఈ రోబోటిక్ టెక్నాలజీ వల్ల రోగులకు తక్కువ నొప్పితో, త్వరగా కోలుకునే అవకాశం లభిస్తుందన్నారు ఈ సందర్భంగా సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవి చంద్ర మాట్లాడుతూ, "100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తిచేయడం మా బృందానికి గర్వకారణం అని, ఇది మా వైద్య నైపుణ్యం పట్ల రోగులు ఉంచే నమ్మకానికి నిదర్శనం అన్నారు. రోబోటిక్ సహాయంతో చేసే శస్త్రచికిత్సలు ఖచ్చితంగా, సురక్షితంగా ఉంటాయి. రోగులు త్వరగా కోలుకుంటారు" అని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ సిఓఓ మయూక్ చౌధురీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోబోటిక్ శస్త్రచికిత్సల కేంద్రంగా కేర్ హాస్పిటల్స్ ఎదుగుతోందని. విశాఖపట్నంలోనే ప్రపంచస్థాయి వైద్యం అందించడమే మా లక్ష్యం" అన్నారు.

రైలు ప్రయాణికులకు 'సీట్ల లభ్యత అంచనా ఫీచర్'ను ప్రారంభించిన మేక్‌మైట్రిప్

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలో రిజర్వుడు రైలు టిక్కెట్లు సీట్లు లభ్యత అంశాలపై తెలిపేందుకు మేక్ మై ట్రిప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి తెలిపారు. రైలు ప్రయాణికులు బయలుదేరేందుకు 60 రోజుల ముందు నుంచి కూడా బుకింగ్ కోసం తెరిచి ఉంటాయి, చాలా మంది ప్రయాణికులు తమ ప్రణాళికలను ప్రయాణతేదీ చాలా దగ్గరగా ఉన్నప్పుడు మాత్రమే ఖరారు చేసుకుంటారు. మేక్‌మైట్రిప్ డేటా ప్రకారం దాదాపు 40 శాతం మంది వినియోగదారులు పలు సెషన్‌లలో, తరచుగా చాలా రోజుల పాటు ఈ ప్రక్రియ సాగే విధంగా రైలు టిక్కెట్లను బుక్ చేసుకుంటారన్నారు. ఈ వినియోగదారులలో, దాదాపు 70 శాతం మంది వెయిట్‌లిస్ట్ చేసిన టిక్కెట్లను బుక్ చేసుకుంటారు, ఎందుకంటే వారి ప్లానింగ్స్ స్థిరపడే సమయానికి ధృవీకరించబడిన సీట్లు అందుబాటులో ఉండవు, ఈ సమస్యలు అన్నీ అధిగమించేందుకు మేక్ మై ట్రిప్ నూతన ఫీచర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. డిమాండ్ నమూనాలు వారం నుండి వారం వరకు గణనీయంగా మారుతూ ఉండటంతో, కన్ఫర్మ్ బుకింగ్‌ల విండో మారుతూ ఉంటుంది. ఏప్రిల్‌లో, చాలా హై-స్పీడ్ రైళ్ల టికెట్లు బయలుదేరే తేదీకి దాదాపు 13 రోజుల ముందు అమ్ముడయ్యాయి. మే నాటికి, పెరుగుతున్న డిమాండ్ కారణంగా, అవి సాధారణంగా బయలుదేరే తేదీకి 20 రోజుల కంటే ముందు బుక్ చేయబడ్డాయి. ప్రయాణికులకు వారు ఏ రైలు కోరుకుంటు న్నారో తెలిసినప్పటికీ, ఎంతకాలం సీట్లు అందుబాటులో ఉంటాయో అనే విషయంలో వారికి తరచుగా నమ్మదగిన అవగాహన ఉండదు, దీని వలన సకాలంలో ప్లాన్ చేసుకోవడం కష్టమవుతుంది, దీనిపై ముందస్తు సమాచారం కోరుతూ ప్రయాణాన్ని రైలు ప్రయాణికులు సులభతరం చేసుకునేందుకు ఈ ఫీచర్లు తోడ్పడతాయని మెక్ మై ట్రిప్ ప్రతినిధి వెల్లడించారు.

పిల్లలు సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు

విశాలాంధ్ర-విశాఖ : పిల్లలు తమ చుట్టూ జరిగే అంశాలను పరిశీలిస్తూ సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అన్నారు. గ్రంధాలయాల సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం పూర్ణా మార్కెట్ సమీపంలోని రంగిరీజు వీధిలోని బాలల గ్రంథాలయంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, అరసం సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు శిక్షణా తరగతులలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న వివిధ రకాల పుస్తకాలను పరిశీలించినప్పుడు చాలా విషయాలు బోధపడుతాయని అన్నారు. వాటిని నచ్చిన భాషలో రాయడం ద్వారా పునాది దృఢం అవుతుందని, సృజన అలవడుతుందన్నారు. చిల్డ్రన్ లైబ్రరీ లైబ్రేరియన్ టి.పోలితల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరసం జిల్లా బాధ్యులు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ బసు పోతన రిసోర్స్‌పర్సన్‌గా పిల్లలకు అవసరమైన జీవన, సృజనాత్మక నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీడెంట్ నూతన యాడ్ ఫిలిం ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశం అత్యధికంగా మెచ్చిన పెర్ఫెట్టీ వాన్ మెల్ ఇండియా కుటుంబానికి చెందిన చ్యూయింగ్ గమ్ లలో ఒకటైన హ్యాపీడెంట్ విడుదల చేసింది ఒక సరికొత్త యాడ్ ఫిల్మ్. చాలా నాటకీయమైనదే అయినా, ప్రయోజనాత్మకమైన మలుపు ఇందులో ఉంటుంది. ఈ కొత్త క్యాంపెయిన్ "చమ్ కింగ్ గమ్ : చమ్కా ముస్కాన్, జగమగ్ జహాన్",-కాంతులు చిమ్మే చిరునవ్వులో మహిమను, కల్పనాశక్తికి స్ఫూర్తినిచ్చే దానిలోని శక్తిని, కళ్ళను ఆకట్టుకునే ఒక గొప్ప కథ ప్రపంచానికి ప్రేక్షకులను ఆకట్టుకునే - ఒక తాజా, సినిమా తరహా లెన్స్‌తో బ్రాండ్ తన చారిత్రాత్మకమైన స్టోరీటెల్లింగ్ (కథను చెప్పే) శక్తిని పునరుత్తేజింపజేసుకుంది. మెక్ కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా వారు ఇతివృత్తం కూర్చిన ఈ క్యాంపెయిన్ కు ప్రఖ్యాత క్రియేటివ్ లీడర్ ప్రసూన్ జోషి నేతృత్వం వహించారు. ఆయన ఈ క్యాంపెయిన్ బ్యాక్ గ్రౌండ్ పాటకు పదాలు కూర్చటమే కాక, తన విలక్షణమైన స్వరాన్ని కూడా అందించారు. బాలీఉడ్ లో ప్రఖ్యాతిగాంచిన సంగీతకారుడు, శాంతనూ మొయిత్రా దీనిని స్వరపరిచారు. హ్యాపీడెంట్ ప్రామాణికతకు, వినోదానికి మరియు ప్రయోజనానికి విలువనిచ్చే కొత్త తరం వినియోగదారుల మనసుకు నచ్చే విధంగా ఈ క్యాంపెయిన్ ను చాలా జాగ్రత్తగా రూపొందించారు. ఈ ఫిల్మ్‌కు కేంద్రబిందువు ఒక కథ. ఆ కథలో పెర్ఫార్మర్ల బృందం ఒకటి ఉంటుంది. వారు ఎర్రని పెయింట్ మెరిసే చిరునవ్వులతో - మనసును హత్తుకునే విజువల్సులో, పరిసర ప్రాంతాలను అనవసరంగా అపరిశుభ్రంగా చేసే దుష్ప్రవర్తనను ఎత్తి చూపుతుంది. ఇది, కాల్పనికమైనదే అయినా, కాంతివంతమైన చిన్న చిన్న పనులు కూడా పెను సామాజిక మార్పులకు దోహదం చేయగలుగుతాయన్న సత్యాన్ని పునరుద్ఘాటిస్తుంది.

ఇకనుండి ఎటువంటి ప్రోటోకాల్ కావాలన్నా ఆలయ అధికారులు చెప్పాల్సిందే

ఉత్తర్వులు జారీ చేసిన ఈఓ

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహలక్ష్మి నృసింహ స్వామివారి ఆలయ దర్శనాలు చేయించడంలో గత ప్రభుత్వ ఆ మాజీ ట్రస్టీకి ఎదురే లేదు. అడిగివారు లేరు. పేరుకు ఆయన మాజీ అయినా తాజానే. నేరుగా లిఫ్ట్ లోంచి తీసుకెళ్లి ఎంతమందికైనా దర్శనం చేయించి, అంతరాలయంలో మెడలో దండలు వేయిస్తారు. దర్శనానంతరం వేద ఆశీర్వచనం చేయించడంలో ఆయనకే చెల్లింది. అడిగిన అధికారి లేరాయె. ఒకవేళ ఎవరైనా అడిగితే ఏఈఓ ఆనందకుమార్ సమాధానం ఇస్తారని అధికారులు అంటున్నారు. సోమవారం నుండి ఎటువంటి ప్రోటోకాల్ కావాలన్న విధులు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు చెప్పాల్సిందే అని ఆదివారం ఉత్తర్వులు ఈఓ జారీ చేశారు. గతంలో మాజీ ట్రస్టీ స్వామివారి దక్షిణ గోపురం నుండి నిత్యాన్న ప్రసాద భవనానికి వెళ్లేంత వరకు భక్తుల సౌకర్యార్థం రూ.90 లక్షలతో షెడ్ నిర్మించారు. దాత తాలూకా వారు వచ్చిన సగం టిక్కెట్లు తీసుకునేవారు. తీసుకుంటున్నారు కూడాను. అసలు విషయానికి వస్తే ఎవరైనా కొండపైన పి.ఆర్.ఓ (సమాచార కేంద్రం)కు వచ్చి ఎం.ఎల్.ఏ, ఎం.పి, రెవెన్యూ, పోలీస్, జ్యుడీషియల్, డిఫెన్స్, ప్రెస్ తదితర ప్రముఖులు ఎవరైనా సంబంధిత కేంద్రానికి వచ్చి తాము ఫలానా అని వారి గుర్తింపు కార్డు చూపిస్తే దర్శనం వచ్చినవారిలో సగం టిక్కెట్లు(రూ.300/-) తీయించి వారివారి హోదాను బట్టి లిఫ్ట్ లేదా రూ.300/- క్యూలైన్ స్టాంప్ వేసి స్వామివారి దర్శనంకు అనుమతి ఇవ్వటం జరుగుతుంది. కానీ కొంతమంది పొరుగు సేవ సిబ్బంది వారికి నచ్చిన, తెలిసినవారు దర్శనంకు వస్తే నేరుగా లిఫ్ట్ ద్వారా దర్శనం చేయిస్తున్నారని నానుడి బాగా ఉంది. ఇదే అదునుగా అధికారులకు కొద్దిపాటి పరిచయం ఉన్నవారు ఆ అధికారి తాలూకా అని చెప్పి నాదారి పక్కదారి అంటూ దేవునికి టిక్కెట్ ద్వారా రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారు.

కోన తాతారావుకు కార్పొరేటర్ ముమ్మన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పెందుర్తి : ఉమ్మడి విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డిసిసిబి) చైర్మన్‌గా నియమితులైన కోన తాతారావు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పెందుర్తి బిజెపి నాయకులు, జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని తాతారావుకు పుష్పగుచ్చం అందజేసి దుశ్శలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డిసిసిబి పర్సన్ ఇంచార్జ్ గా బాధ్యతలు స్వీకరించిన కోన తాతారావు హయాంలో సంస్థ మరింత అభివృద్ధి సాధించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత మద్దతుగా నిలుస్తుందని కార్పొరేటర్ ముమ్మన ఆకాంక్షించారు.

పకృతి వ్యవసాయమే భవిష్యత్తుకు ఆధారం

భీమిలి ఏఎంసీ చైర్మన్ కే రామస్వామినాయుడు



విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభ మండలం కోరాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ అవగాహన సదస్సులో పద్మనాభం జనసేన మండల అధ్యక్షులు (భీమిలి ఏఎంసీ చైర్మన్) కురిమిన రామస్వామి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు అలవర్చుకోవాలని రసాయనాలకి దూరంగా ఉంటూ ప్రకృతి సిద్ధమైన వ్యవసాయాన్ని అవలంబించడం ద్వారా భావి తరాల బంగారు భవిష్యత్తుకి దోహద పడవచ్చని రైతులకు పిలుపునిచ్చారు. నవధాన్యాల సాగు మరియు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి రైతులకు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కోరాడ గ్రామం టిడిపి మాజీ సర్పంచ్ గెద్ద ప్రసాద్,పద్మనాభ మండల మాజీ బిజెపి అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పద్మనాభం మండల కూటమి నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెదగంట్యాడ : జీవీఎంసీ 65వ వార్డు వాంబె కోలని గరుడాద్రి కొండపై కొలువు దిరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 6వ తేదీ శుక్రవారం ధ్వజస్థంభ ప్రతిష్ట అత్యంత విభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల తెలిపారు. దీనికి సంబంధించి ఆలయ ప్రాంగణంలో సోమవారం పాత్రికేయులు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరణ చేసి అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీ సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన పూజిత ప్రారంభమై అంకురారోహణ మంగళ స్నానం తీర్థ గోష్ట మృత్య గ్రహణం అలాగే ఐదవ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటలకు యాగశాల ప్రవేశ పూజతోపాటు అగ్ని ప్రతిష్టాపన ధ్వజ పతాక ప్రతిష్ట మంత్రపుష్పం వంటి విశిష్ట పూజలు అలాగే ఆరో తేదీ శుక్రవారం ఉదయం 7గంటల 47 నిమిషాలకు ధ్వజస్తంభ, యంత్ర ప్రతిష్ట మహోత్సవం శ్రీశ్రీ శ్రీనివాససంద సరస్వతి స్వామి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాదు పరిషత్ అధ్యక్షులచే అత్యంత వైభవంగా జరుగుతుందని అన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిత్తన అప్పలరెడ్డి, పెంటకోటరాజు, తిత్తి రామ్మూర్తి లీలావతి,రమణ, కోవిరి జానకి, పందూరి సత్యవతి, గవర లక్ష్మి, చిన్నమ్మలు, పద్మ, భవాని, హిమజ, పద్మ, చిట్టమ్మ, నాగమణి, శ్రీలక్ష్మి, రమాదేవి, జి.లక్ష్మి, జె.లక్ష్మి, కె.నాగమణి, కె.గంగాభవాని, ఎల్.శారద, పద్మ, రత్నకుమారి, సరస్వతి, లక్ష్మి, అనుష మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూఫ్ టాప్ సోలార్ అవగాహన ర్యాలీలకు విశేష స్పందన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద ఇంటిపై కప్పుపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని ఏపీఈపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి శ్యాంబాబు తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ పై వినియోగదారులలో పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు విశాఖపట్నం సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్ల ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ పథకంపై ర్యాలీ లు నిర్వహించారు. ఇందులో భాగంగా జోన్-1 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో సత్యం

కంప్యూటర్స్ నుంచి అల్లూరి సీతారామ రాజు విగ్రహం వరకు, జోన్-2 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు ఆధ్వర్యంలో గాజువాక జంక్షన్ నుంచి బీసీ రోడ్ జంక్షన్ వరకు, జోన్-3 డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాలాక్షి నగర్ నుంచి బీచ్ రోడ్ వరకు మూడు డివిజన్లలోను పెద్దఎత్తున నిర్వహించిన ర్యాలీలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఎస్ఈ తెలిపారు. ర్యాలీ అనంతరం ఎస్ఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అయ్యే ఖర్చు 60 వేల రూపాయలలో 30 వేలు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, రెండు కిలోవాట్లకు 60 వేలు, మూడు కిలోవాట్లకు 78 వేల రూపాయలు ప్రభుత్వ రాయితీ వస్తుందని, బీసీ కులాల వారికి 20 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకున్నవారు కిలోవాట్ కు 120 యూనిట్ల చొప్పున విద్యుత్ ను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని విద్యుత్ పొదుపుతో పాటు బిల్లులు కూడా తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ ర్యాలీలలో డిఈఈ లు, ఏఈ లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వం

వైసీపీ మండలాధ్యక్షుడు దువ్వాడ రవికుమార్

విశాలాంధ్ర-పలాస : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను నమ్మించి మోసం చేసిందని వైసీపీ మండలాధ్యక్షులు దువ్వాడ రవికుమార్ అన్నారు. ఈ నెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం వైసీపీ కార్యాలయం ప్రగతి భవనంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన 147 హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి పాలనను నిలదీసేందుకు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బుధవారం ఉదయం 10గంటలకు కాశీబుగ్గ వైఎస్ఆర్ విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమవుతుందని, పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయిక్రిష్ణ,వైసీపీ అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోదన, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పైల చిట్టి, ఎంపిటిసి జి.మోహనరావు, వైసీపీ నాయకులు మురళీ, షన్ముఖరావులు పాల్గొన్నారు.

సమన్వయ కర్తకు సన్మానం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : చిన్ననాటి స్నేహితులు. 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు. హైస్కూల్ విద్య పూర్తి అయిన తరువాత ఎవరి బాటలో వారు పయణించి అనుకున్న లక్ష్యాలను చేరుకుంటున్నారు. స్నేహితుల్లో ఒకరికి గతంలో కలిసి మెలిసి చదువుకున్న వారిని ఒకే వేదికపై చూడాలపించింది. ఆమె ఒక్క అడుగు ముందుకేసింది. మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన కారి జయలక్ష్మీ. వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40 ఏళ్ల క్రితం చదువుకున్న స్నేహితులందరి ప్రస్తుత చిరునామాలు కనుక్కొని నాలుగు నెలలుగా ఎంతో వ్యయప్రయాసాలతో కృషి చేసి ఒకే వేదికపై కలుసుకునేలా చేసింది జయలక్ష్మీ. మిత్రులందరు ఆదివారం అక్కుపల్లి సముద్రతీరం వద్ద ఆత్మీయ కళయిక అయ్యారు. 40 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలను గుర్తు చేసుకొని ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. దీనికి ముఖ్యకారకులైన కారి జయలక్ష్మీతో పాటు పిన్నాసి జోగారావు, మాకుపెల్లి తులసిదాసులను ప్రవాసాంధ్రుడు ప్రముఖ పారిశ్రామిక వేత్త గుంటు వేణుగోపాల్‌లతో పాటు స్నేహితులందరు సోమవారం వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. భవిష్యత్‌లో అందరు కలిసేందుకు కృషి చేస్తామని తోటి మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తామని ప్రతిన బూనారు.

గాజువాకలో రాజీవ్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : గాజువాక ప్రాంత ప్రజలు ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా ఉండేలా క్రీడలను ప్రోత్సహిస్తూ ,క్రీడాకారులకు, ప్రజలకు అనుకూలంగా అన్ని హంగులతో 65 వ వార్డు వికాస్ నగర్ గల రాజీవ్ క్రీడా ప్రాంగణంలో రాజీవ్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, కళాక్షేత్రం 9 కోట్ల రూపాయల జీవీఎంసీ సాధారణ నిధులు, శాప్ నిధులతో అభివృద్ధిపరిచి గాజువాక ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచడమైనదని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు ,65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు తో కలిసి రాజీవ్ క్రీడా ప్రాంగణంలో అభివృద్ధి పరిచిన రాజీవ్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లను పునః ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవం చేసి రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోర్టు ను ప్రారంభించి అందరూ కలిసి బ్యాడ్మింటన్ గేమ్ ను ఆడి అందరికీ స్ఫూర్తినిచ్చారు. అనంతరం ప్రాంగణంలో అభివృద్ధి పరిచిన శ్రీ రాజరాజేశ్వరి కళాక్షేత్రం నందు సమావేశ సభను నిర్వహించారు. ఈసభలో ముందుగా మేయర్ మాట్లాడుతూ గాజువాక పారిశ్రామిక ప్రాంతం అయినందున ప్రజలకు ఆహ్లాదకరంగా, ఆరోగ్యపరంగా, వినోదాత్మకంగా క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్ది క్రీడలకు సంబంధించిన బ్యాడ్మింటన్ కోర్టులను, స్విమ్మింగ్ పూల్ ను, కళాక్షేత్రమును , వ్యాయామం కొరకు వాకింగ్ ట్రాక్ ను జీవీఎంసీ 9 కోట్ల నిధులతో అభివృద్ధిపరిచి గాజువాక ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచిందని, ఈ క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, నిత్యం వినియోగించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు అందరూ దోహదపడాలని మేయర్ తెలిపారు. ఈ ప్రాంగణంలో నిర్వహణను క్రీడాకారులే ఒక సొసైటీగా ఏర్పడి దీన్ని ఎటువంటి ఆటంకం లేకుండా బాధ్యతతో నిర్వహించుకోవాలని ప్రజలకు క్రీడాకారులకు మేయర్ సూచించారు. గాజువాక ప్రాంతంలో ప్రజల కొరకు క్రీడలను ప్రోత్సహిస్తూ మరిన్ని స్టేడియంలను జీవీఎంసీ అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందని , మేయర్ గా తన సహకారం ఉంటుందని,అందుకు ప్రజలు క్రీడలపై మక్కువ పెంచుకొని ఆరోగ్య పరిరక్షణ దిశగా ఈ క్రీడా ప్రాంగణాన్ని వినియోగించుకోవాలని మేయర్ తెలిపారు. అనంతరం విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం శ్రీ భరద్ మాట్లాడుతూ ఇటువంటి మంచి స్టేడియం గాజువాక ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉన్నందుకు ఆనందం వ్యక్త పరుస్తూ , ఈ ప్రాంగణంలో త్వరలో పికిల్ బాల్ కోర్టు కూడా ఇక్కడ ఏర్పాటు చేయాలని మేయర్ కు సూచించారు. సమాజంలో ప్రజలు సెల్ ఫోన్ కు అంకితమైపోయి నడకకు, వ్యాయామానికి, మానసిక ప్రశాంతత కు,ఆరోగ్య రక్షణకు, శారీరక శ్రమకు దూరమైపోయి అనారోగ్యానికి

గురవుతున్నారని, ఇకపై ఇటువంటి క్రీడా ప్రాంగణంలో మానసిక ఉల్లాసంతో ,శారీరక శ్రమతో క్రీడలను అలవరచుకుంటూ, తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలపై ప్రోత్సాహాన్ని చూపించాలని, ఆరోగ్యానికి క్రీడలు చాలా దోహదపడతాయన్నారు. ఈ క్రీడా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఈ కళాక్షేత్రంలో నిర్వహించుకుంటూ ఈ ప్రాంత ప్రజలు ఆహ్లాదంగా ఆరోగ్యవంతంగా ఉంటారని కోరుకుంటున్నాను అన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాంగణం ప్రారంభ కర్త మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు అని గుర్తు చేస్తూ, మరలా ఈ క్రీడా ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి పరిచి ప్రజలకు అందించినందుకు మేయర్ కు కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు క్రీడలను ప్రోత్సహిస్తూ వారిలో చరిత్రకారులను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ స్టేడియం నుండే గాజువాక ప్రాంత క్రీడాకారులు అభివృద్ధి కావాలని, రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడాకారులను వెలికి తీసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నో ప్రోత్సాహకాలను క్రీడాకారుల కొరకు ప్రవేశపెడుతున్నారన్నారు. వారి ఆశయ స్ఫూర్తితో గాజువాకలో 10 స్టేడియంలను ఆదర్శనగర్ ,వడ్లపూడి, ఫార్మాసిటీ ,బిసి రోడ్ ,శీలానగర్ తదితర ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో నిర్మిస్తామని అన్నారు. త్వరలోనే ఆదర్శ్ గ్రౌండ్ లో క్రికెట్ స్టేడియం ను నిర్మించి గాజువాక ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల కొరకు అత్యాధునిక వసతులతో క్రీడలను ప్రవేశ పెడుతూ

క్రీడాకారులను ప్రోత్సహిస్తూ స్టేడియంల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని , ప్రజల కొరకు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పాలన చేస్తుందన్నారు. గాజువాక ప్రాంతంలో ఇటువంటి మంచి స్టేడియం ని నిర్మించి జీవీఎంసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినందున దీన్ని నిత్యం పరిశుభ్రతతో జాగ్రత్తగా నిర్వహించుకోవాలన్నారు. అనంతరం 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహం పాత్రుడు మాట్లాడుతూ ఈ

పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల కొరకు, క్రీడాకారుల కొరకు రాజీవ్ క్రీడా ప్రాంగణాన్ని ఇండోర్ స్టేడియం ను, స్విమ్మింగ్ పూల్ ను అభివృద్ధి పరిచి జీవీఎంసీ ప్రజలకు అందించినందుకు సహకరించిన నగర మేయర్ కు, పార్లమెంట్ సభ్యులకు, శాసనసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. జూన్ 21న జరుగనున్న 11వ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాంధ్రా కార్యక్రమాలకు సిద్ధమవుతూ గాజువాక ప్రాంత నివాసి చిన్నారి బిందు శ్రీ సభలో అతిధుల ముందు యోగాసనాలను వేసి అందరికీ స్ఫూర్తిని కలిగించినందుకు గాను బిందు శ్రీ ను అభినందించి దుస్సాలులతో సత్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విశాఖ అధ్యక్షులు గండి బాబ్జి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పల రమణారెడ్డి, వార్డు కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, రౌతు శ్రీనివాసరావు, బట్టు సూర్యకుమారి,రాజాన రామారావు, జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి, పర్యవేక్షక ఇంజనీర్ గోవిందరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా

విశాలాంధ్ర-పలాస/వజ్రపుకొత్తూరు : పేద బడుగు వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. సోమవారం పలాస మండలంలో మాకన్నపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ దుణాఖాలకు వెళ్లలేని 65ఏళ్ల దాటిన వృద్దులకు, వికలాంగులకు ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పేరుతో నిధులు వృదా చేయడంతో పాటు సక్రమంగా రేషన్ సరుకులను వినియోగదారులకు పంపిణీ చేయకుండా అక్రమ మార్గాలను అనుసరించారని ఆరోపించారు. దీనిని గమనించిన కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి డీలర్ వ్యవస్థను తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుద్దరించారని అన్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ సరుకులను సక్రమంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్నికల ఉపతహశీల్దార్ గిరి, టీడీపీ నాయకులు విఠల్, కుత్తుమ లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలం గరుడభద్ర గ్రామంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేసిన రేషన్ డిపోలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు ప్రతి నెల రేషన్ దుఖాణాల్లో సరుకులను అందజేస్తారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీతారామయ్య, ఉపతహశీల్దార్

మురళీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, కొంచాడ మోహనరావు, పోతనపల్లి సాంబమూర్తి, రెల్ల దానయ్య, గూడ శాంతారావు, మురిపింటి నారాయణ, కోనేరి ఆదినారాయణ పాల్గొన్నారు.

రైళ్ళ నిలుపుదలకు విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నియోజకవర్గంలో గల రైలు నిలయాల్లో ప్రధాన రైళ్ళ నిలుపుదలకు జెడ్.ఆర్.సి.సి సభ్యులు విజ్ఞప్తి చేసారు. ఈస్టుకోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ కె.కె ఖడంగ, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ వై.ఎన్.బాబు, కమర్షియల్ మేనేజర్ డాక్టర్ పౌల్‌లను సోమవారం కలుసుకుని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో యశ్వంత్‌పూర్, పూరి-అహ్మదాబాద్, సమతా ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయించాలని, మందసలో విశాఖ ఎక్స్‌ప్రెస్, జాడుపూడి, బారువా స్టేషన్‌లలో బరంపురం-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు హాల్టింగ్ కల్పించాలని కోరారు. ఇచ్ఛాపురంలో ఉత్తర భాగంలో రెండు ప్రక్కల, 2వ ప్లాట్‌ఫారంపై నాలుగు షెడ్లు నిర్మాణం చేపట్టాలని, సోంపేట స్టేషన్ రెండవ ఫ్లాట్‌ఫారంపై రెండు షెడ్లు నిర్మాణం చేపట్టాలని కోరామని, అందనుకు అధికారులు సానుకూలంగా స్పందించారని జెడ్.ఆర్.యు.సి.సి సభ్యులు శ్రీనువాస్ రౌళా తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే యూజర్ మెంబర్స్ సదానంద రౌలో, రత్నాల శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికమైన, రుచికరమైన వంటలు తయారు చేసి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి కె.అప్పారావు అన్నారు. వంటల తయారీపై సోమవారం 69 పాఠశాలలకు చెందిన నిర్వాహకులు, వంట సహాయకులకు ప్రత్యేక శిక్షణ అవగాహన కల్పించారు. వంట చేసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎస్.విశ్వనాధం, ఉన్నత పాఠశాలల హెచ్.ఎం.లు శ్రీనువాసరావు, సి.హెచ్. వెంకటరమణ, ట్రైనింగ్ ఇన్‌ఛార్జి అప్పలనరసమ్మ, ఎం.ఈ.ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామేశ్వరంలో స్వేచ్ఛా నృత్యతరంగిణికి ప్రశంశలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో నృత్యాంజలి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్స్-2025 సందర్భంగా మహల్ కళావేదిక లక్ష్మణ తీర్థం రామేశ్వరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక శ్రీ స్వేచ్ఛానృత్య తరంగణి చిన్నారుల బృంధానికి ప్రత్యేక ప్రశంశలు దక్కాయి. రెండు గంటల పాటు స్వేచ్ఛానృత్య తరంగణి నాట్యగురువు శివానంద అవార్డు గ్రహీత మంగి దివ్యతో పాటు ఇతర కళాకారుల భరతనాట్య, కూచిపూడి, కథాకళి అద్భుత ప్రదర్శనకు అభినందించి అవార్డులు అందజేసారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ప్రోగ్రాం ఆర్గనైజర్ శరత్ చంద్ర ప్రశంశాపత్రాలు అవార్డులను అందించారు. ఈ సందర్భంగా అవార్డులు దక్కించుకున్న కళాకారులకు అకాడమి అధ్యక్షులు కె గోవిందరావు. కోశాధికారి మంగి దాలమ్మలు అభినందించారు.